క్లుప్తంగా

వీరబ్రహ్మంగారి ఆలయ కార్యవర్గం ఎన్నిక


నూతన ఆలయ కార్యవర్గం

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని శ్రీ పోతులూరి వీరబ్రహ్మంగారి ఆలయ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఆలయ ఆవరణలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నల్లగొండ శ్రీరాములు, ప్రధాన కార్యదర్శిగా కస్తూరి రమేశ్, కోశాధికారిగా నల్లగొండ తిరుపతి, ఉపాధ్యక్షులుగా బట్టుపెల్లి నానయ్య, శ్రీరాం వరప్రసాద్, గౌరవ అధ్యక్షులుగా శ్రీరామోజు వెంకటయ్య, బెజ్జంకి మోహన్, సలహాదారులుగా శ్రీరామోజు భాస్కర్, గద్దెలపల్లి వెంకటయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

'ఇళ్ల నిర్మాణం అడ్డుకుంటే ఉపేక్షించేది లేదు'


మాట్లాడుతున్న అర్షద్ హుస్సేన్

బెజ్జూర్: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను అడ్డుకుంటే ఉపేక్షించేది లేదని టీపీసీసీ మెంబర్ అర్షద్ హుస్సేన్ అన్నారు. మండలంలోని సుస్మీర్ గ్రామంలో ప్రభుత్వం ఇచ్చిన ఇందిరమ్మ ఇళ్లను రిజర్వ్ ఫారెస్టులో నిర్మిస్తున్నారని అడ్డుకోవడంతో ఆదివారం ఇందిరమ్మ ఇళ్లను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో హక్కు పత్రాలు సైతం ఇచ్చారని, నిర్మాణం ప్రారంభించాక అడ్డుకోవడం సరికాదన్నారు.

సన్నబియ్యం పట్టివేత


అధికారులు పట్టుకున్న సన్నబియ్యం

కౌటాల: కౌటాల మాజీ సర్పంచ్ వొజ్జల మానిక్ ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ సన్నబియ్యాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీలు రాజ్‌కుమార్, శ్రీనివాస్ ఆదివారం పట్టుకున్నారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలో వొజ్జల మానిక్ ఇంట్లో అక్రమంగా రేషన్ సన్నబియ్యం నిల్వ ఉన్నాయనే పక్కా సమాచారంతో దాడులు చేసి 13.40 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకున్నట్లు తెలిపారు. ఆయా గ్రామాల్లో రేషన్ లబ్ధిదారుల నుంచి కొనుగోలు చేసిన బియ్యాన్ని దళారులు తీసుకొచ్చి అధిక ధరకు విక్రయించడానికి కౌటాలకు తరలించినట్లు పేర్కొన్నారు. అక్రమంగా రేషన్ సన్నబియ్యం విక్రయించడానికి తెచ్చిన దళారులు షేక్ జైనుద్దీన్, పెరుగు ప్రభాకర్, పోతుల వార్ తిరుపతి, గుర్లె విట్టుమేర, విలాస్, మనోహర్‌తో పాటు రేషన్ సన్నబియ్యం కొనుగోలు చేసిన వొజ్జల మానిక్‌పై 6ఏ కేసు నమోదు చేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీలు తెలిపారు.

నేటి నుంచి ధ్రువపత్రాల పరిశీలన

కౌటాల: రాజీవ్ యువ వికాసం పథకం కోసం దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థుల ధ్రువపత్రాలను నేటి నుంచి కౌటాల ఎంపీడీవో కార్యాలయంలో పరిశీలించనున్నట్లు ఎంపీడీవో రమేశ్ ఆదివారం తెలిపారు. ఈ నెల 5 నుంచి 9వ తేదీ వరకు మండలంలోని గ్రామ పంచాయతీల వారీగా ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు అభ్యర్థుల దరఖాస్తులు పరిశీలిస్తామని తెలిపారు. 5న పార్డీ, సాండ్‌గాం, వీరవెల్లి, ముత్తంపేట, 6న శీర్షా, కనికి, గురుడుపేట, తలోడి, 7న మొగడ్‌దగడ్, తాటినగర్, తాటిపల్లి, నాగేపల్లి, 8న వీర్దండి, గుండాయిపేట, తుమ్మిడిహెట్టి, భాలేపల్లి, 9న బోదంపల్లి, గుడ్లబోరి, కన్నెపల్లి, కౌటాల గ్రామ పంచాయతీల లబ్ధిదారుల ధ్రువపత్రాల పరిశీలన ఉంటుందన్నారు. మొత్తం 2033 మంది దరఖాస్తులు చేసుకున్నారని, సకాలంలో దరఖాస్తుదారులు రావాలని ఎంపీడీవో తెలిపారు.

మిషన్ భగీరథ నీళ్లు అందించాలి


అర్షద్ హుస్సేన్‌తో కాలనీవాసులు

బెజ్జూర్: మండల కేంద్రంలోని కాలనీల్లో ప్రజలు నీటి సమస్యతో సతమతమవుతున్నారని, మిషన్ భగీరథ నీళ్లు అందించి సమస్యను తీర్చాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర టీపీసీసీ మెంబర్ అర్షద్ హుస్సేన్ పేర్కొన్నారు. ఆదివారం అంబేడ్కర్‌నగర్, మత్స్యకారుల కాలనీవాసులు సమస్యను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఆయన జిల్లా కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి మంచినీళ్లు అందించాలని కోరారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరించి మిషన్ భగీరథ నీళ్లు అందించాలని కోరినట్లు ఆయన తెలిపారు.

నిర్వహణ మరిచారు!

- నాగమ్మ చెరువు చెక్‌డ్యాంను పట్టించుకోని అధికారులు
- పూడికతో నిండిన కాలువలు
- బీళ్లుగా మారిన ఆయకట్టు భూములు
- నష్టపోతున్న రైతులు


చెత్తాచెదారంతో నిండిన నాగమ్మ చెరువు చెక్‌డ్యాం కాలువ

సిర్పూర్(టి): చెక్‌డ్యాం కాలువలు చెత్తాచెదారంతో నిండిపోయి నీరు ఆయకట్టుకు అందకపోవడంతో చెరువుల ఆయకట్టు భూములు బీడుగా మారుతున్నాయి. సిర్పూర్(టి) మండలకేంద్రం మీదుగా ప్రవహిస్తున్న సిర్పూర్(టి) వాగుపై గత 10 సంవత్సరాల క్రితం అప్పటి ప్రభుత్వం మినీ చెక్‌డ్యాం నిర్మించింది. చెక్‌డ్యాం నుంచి మండల కేంద్రంలోని బెస్తకాలనీ, గొల్లవాడ, ఎస్సీకాలనీ, రైల్వేస్టేషన్ ఏరియా ప్రాంతాల మీదుగా స్థానిక భీమన్న కుంట వరకు కాలువలు నిర్మించి చెక్‌డ్యాం ద్వార నీటిని వదులుతున్నారు. గత పదేళ్లుగా నాగమ్మ చెరువు చెక్‌డ్యాం నిర్వహణను ఎవరూ చేపట్టకపోవడంతో కాలువలు మొత్తం పూడుకుపోయాయి. కాలువలు చెత్తాచెదారంతో నిండిపోవడంతో చెక్‌డ్యాం నీరు భీమన్నకుంట, నాగమ్మ చెరువు ఆయకట్టుకు రావడం లేదు.

బీడుగా పంట పొలాలు..

మండలకేంద్రంలోని నాగమ్మ చెరువు, భీమన్న కుంటల ఆయకట్టులో వందల ఎకరాలు పంట పొలాలు ఉన్నాయి. గతంలో రైతులు ఆయకట్టు భూముల్లో వరి పంటలు వేసుకోగా ఇప్పుడు వేసవిలో చెరువుల్లో ఉన్న నీరు ఎండిపోతుండటం, నాగమ్మ చెరువు చెక్‌డ్యాం నీరు రాకపోవడంతో యాసంగిలో పంటలు వేయకుండా భూములను బీడుగా వదిలేస్తున్నారు. నాగమ్మ చెరువు కింద సుమారు 1600 ఎకరాల పంట పొలాలు ఆయకట్టు ఉండగా, భీమన్న కుంట కింద సుమారు 20 ఎకరాల వరకు పంట పొలాలు ఆయకట్టు భూములున్నాయి. యాసంగి పంటలు పండే భూములకు చెక్‌డ్యాం నీరు రాకపోవడంతో బీడుగా వదిలేస్తున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చెక్‌డ్యాం నిర్వహణ కరువు..

ప్రభుత్వం రైతుల సౌకర్యార్థం సిర్పూర్(టి) వాగుపై నాగమ్మ చెరువు చెక్‌డ్యాం నిర్మించింది. కాలువల ద్వార స్థానిక భీమన్న కుంటకు, నాగమ్మ చెరువుకు నీరందేలా చర్యలు చేపట్టింది. కాని సంబంధిత అధికారులు నిర్వహణ చేపట్టకపోవడంతో చెక్‌డ్యాంకు సంబంధించిన కాలువలు చెత్తాచెదారం, మట్టి, పొదలతో నిండిపోయాయి. దీంతో ఆయకట్టుకు చెక్‌డ్యాం నీరు అందడం లేదు. చేసేదేం లేక రైతులు క్రమంగా ఆయకట్టు పరిధిలో పంటలు సాగు చేయడం తగ్గిస్తున్నారు. నాగమ్మ చెరువు చెక్‌డ్యాం నిర్వహణను రైతులే చూసుకోవాలా..? లేదా సంబంధిత శాఖ అధికారులు చూసుకుంటారా..? అన్న దానిపై రైతులకు అవగాహన లేదు. దీంతో చెక్‌డ్యాం కాలువలు పూడుకుపోయి నిరుపయోగంగా మారాయి. అధికారులు స్పందించి నాగమ్మ చెరువు చెక్‌డ్యాం కాలువలు పూడికలు తీయించి రైతులు యాసంగి పంటలు వేసుకునేలా చర్యలు తీసుకోవాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

నీరు రాక నష్టపోయాం..



మండలకేంద్రంలోని భీమన్న కుంట ఆయకట్టు భూముల్లో యాసంగిలో వరి పంట సాగు చేశాం. నాగమ్మ చెరువు చెక్‌డ్యాం కాలువలు పూడుకుపోవడంతో చెక్‌డ్యాం నీరు రావడం లేదు. దీంతో తీవ్రంగా పంటలకు నష్టం వాటిల్లింది. అధికారులు వెంటనే సమస్య పరిష్కారాని చొరవ చూపాలి.

– ఎల్ములే మోతీరాం, గంగాయిగూడ

కాలువల్లో పూడిక తీయించాలి



మండలకేంద్రంలోని నాగమ్మ చెరువు చెక్‌డ్యాంతో స్థానిక భీమన్న కుంట, నాగమ్మ చెరువు ఆయకట్టు రైతులు యాసంగి పంటలు సాగు చేస్తున్నారు. చెక్‌డ్యాం కాలువలు చెత్తాచెదారంతో నిండిపోవడంతో నీరు రావడంలేదు. క్రమంగా రైతులు యాసంగి పంటలు వేయడం తగ్గిస్తున్నారు. అధికారులు, ప్రభుత్వం స్పందించి చెక్‌డ్యాం కాలువల పూడికలు తీయించాలి.

– సాత్పుతే రవీందర్, దుబ్బగూడ

గాలివాన బీభత్సం


బాబాపూర్ గ్రామంలో ధ్వంసమైన ఇల్లు


ఆసిఫాబాద్: తెగిపడిన విద్యుత్ తీగలు

- రోడ్డుపైనే విరిగిపడిన చెట్లు
- పలు ఇళ్లు ధ్వంసం
- విద్యుత్ సరఫరాకు అంతరాయం

చింతలమానెపల్లి: మండలంలో ఆదివారం గాలివాన బీభత్సం సృష్టించింది. సాయంత్రం సమయంలో భారీ గాలులతో కూడిన వడగళ్ల వాన కురవడంతో పలు గ్రామాల ప్రజలు ఆందోళనకు గురయ్యారు. గాలులతో పలువురి ఇళ్ల ధ్వంసం కాగా విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. రహదారులపై చెట్లు పడడంతో రవాణాకు అంతరాయం కలిగింది. బాబాపూర్ గ్రామంలో గడ్డం శకుంతల అనే మహిళ ఇల్లు పైకప్పు ఎగిరిపోయింది. బాబాసాగర్‌లో కామెర అశోక్ ఇంటికప్పు ధ్వంసమైంది. బాబాసాగర్ గ్రామంలో విద్యుత్ స్తంభం విరిగిపోయింది. డబ్బా నుంచి ప్రధాన రహదారిపై చెట్లు కూలిపోయాయి. మండలంలో గాలుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిచిపోగా ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

కౌటాలలో భారీ వర్షం

కౌటాల: కౌటాల మండలంలో ఆదివారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. భారీ ఈదురుగాలుల కారణంగా కౌటాల –బెజ్జూర్ ప్రధాన రహదారిపై చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. దీంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. కౌటాల ఎస్సై గుంపుల విజయ్ సంఘటన స్థలానికి చేరుకొని చెట్ల కొమ్మలను తొలగించడంతో రాకపోకలు కొనసాగాయి. ఈదురు గాలుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో గ్రామాలు అంధకారంలో ఉన్నాయి. దీంతో విద్యుత్ వినియోగదారులకు తిప్పలు తప్పలేదు. వర్షం కురవడంతో వాతావరణం చల్లబడడంతో ప్రజలు వేడి నుంచి ఉపశమనం పొందారు.

తప్పిన పెను ప్రమాదం

ఆసిఫాబాద్: మండలంలోని ఈదులవాడ గ్రామ పంచాయతీ పరిధిలోని కొమ్ముగూడలో శనివారం రాత్రి విద్యుత్ స్తంభం విరిగి కింద పడటంతో తీగలు ఓ ఇంటిపై పడి మంటలు చెలరేగాయి. దీంతో గ్రామస్తులు విద్యుత్ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో విద్యుత్ సరఫరా నిలిపివేశారు. దీంతో పెను ప్రమాదం తప్పింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. పాత విద్యుత్ స్తంభానికి ట్రాన్స్‌ఫార్మర్ బిగించడంతో పక్కనే ఉన్న చెట్టుకొమ్మలు విరిగి తీగలపై పడటంతో స్తంభం విరిగి కింద పడిపోయింది. దీంతో తీగలు తెగి పక్కనే ఉన్న తోట పోచయ్య ఇంటి రేకులపై పడ్డాయి. ఇప్పటికైనా అధికారులు ట్రాన్స్‌ఫార్మర్‌ను గ్రామ చివరన బిగించి, ప్రమాదాలు చోటు చేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.


కౌటాల: కౌటాల -బెజ్జూర్ ప్రధాన రహదారిపై పడిన చెట్ల కొమ్మలను తొలగిస్తున్న పోలీసులు

అక్రమార్కులపై కేసులు నమోదు చేయాలి


మాట్లాడుతున్న మడావి రఘునాథ్

కెరమెరి: ఆదివాసీ చట్టాలు మండలంలో ఉల్లంఘనకు గురవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని రాజ్‌గోండ్ సేవా సమితి మండలాధ్యక్షుడు మడావి రఘునాథ్ ఆరోపించారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆదివాసీ చట్టాలు 1/70, పెసాలకు విరుద్ధంగా అక్రమ నిర్మాణాలు జరుగుతున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహిస్తున్నారని, ఏజెన్సీ ప్రాంతాన్ని అణిచి వేతకు గురి చేస్తున్నారని ఆరోపించారు. అసైన్డ్ భూములను కొనుగోలు చేసి కొందరు బడాబాబులు అక్రమ పట్టాలు చేసి అనుభవిస్తున్నారని ఆరోపించారు. మండలంలోని మెట్టపిప్రి, ఝరి ప్రాంతాల్లో అక్రమ భవనాలు నిర్మిస్తూ ఏజెన్సీ చట్టాలకు తూట్లు పొడుస్తున్నారన్నారు. అక్రమార్కులపై కేసులు నమోదు చేయకుంటే తహసీల్దార్ కార్యాలయం ముట్టడి, రాస్తారోకో చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు కోవ విజయ్, ఆవిసం మండలాధ్యక్షుడు సెడ్మకి తుకారాం, తుడుందెబ్బ నాయకులు రాజేశ్వర్ పెందోర్, సిడాం నాగోరావు, ఆత్రం విశ్వేశ్వర రావు ఉన్నారు.

కాగజ్‌నగర్ ఎక్స్‌ప్రెస్‌కు హాల్టింగ్ కల్పించాలి



మాట్లాడుతున్న ఏరియా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రావు

రెబ్బెన: మండల కేంద్రంలోని ఆసిఫాబాద్‌రోడ్ రైల్వేస్టేషన్‌లో కాగజ్‌నగర్ ఎక్స్‌ప్రెస్‌కు హాల్టింగ్ కల్పించాలని టీబీజీకేఎస్ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాస్‌రావు డిమాండ్ చేశారు. ఆదివారం గోలేటిలోని తమ యూనియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ మంచిర్యాల నుంచి మహారాష్ట్ర సరిహద్దు వరకు నిర్మించిన 363 జాతీయ రహదారి ప్రారంభోత్సవ కార్యక్రమానికి కేంద్ర మంత్రి నితిన్ గడ్కారీతో పాటు కేంద్ర మంత్రులు, రాష్ట్ర మంత్రులు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న ఆసిఫాబాద్ రైల్వేస్టేషన్‌లో కాగజ్‌నగర్ ఎక్స్‌ప్రెస్ హాల్టింగ్ కోసం దృష్టి పెట్టాలన్నారు. నియోజకవర్గంలో ఉన్న ఏకైక రైల్వేస్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ లేకపోవడంతో దూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు బెల్లంపల్లి, కాగజ్‌నగర్ రైల్వే స్టేషన్లకు వెళ్లాల్సి వస్తోందన్నారు. నియోజక వర్గ ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని కాగజ్‌నగర్ ఎక్స్‌ప్రెస్‌కు ఆసిఫాబాద్ రోడ్ రైల్వే స్టేషన్‌లో హాల్టింగ్ కల్పించేలా కేంద్ర, రాష్ట్ర మంత్రులు చొరవ తీసుకోవాలని కోరారు. సమావేశంలో ఏరియా కార్యదర్శి మారిన వెంకటేశ్, స్వామిలు పాల్గొన్నారు.

నిరుపయోగంగా 'గిరివికాస్' బోర్లు



ఈచిత్రంలో కనిపిస్తున్న మహిళ గుండెపల్లి గ్రామానికి చెందిన రైతు ఎలాది జ్యోతి. ఈమెకు కమ్మర్‌గాం శివారులో 8 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. గిరి వికాసం పథకంలో మూడేళ్ల క్రితం వ్యవసాయ భూమిలో బోరు వేశారు. విద్యుత్ కనెక్షన్‌ల కోసం ఏళ్లుగా తిరుగుతున్నా నేటికీ మంజూరు చేయలేదు. పథకానికి అర్హులైనా అధికారుల తీరుతో తీవ్రంగా నష్టపోతున్నామని జ్యోతి ఆవేదన వ్యక్తం చేస్తోంది.

- బోర్లు వేసి, విద్యుత్ కనెక్షన్ మరిచిన అధికారులు
- త్రీఫేజ్ విద్యుత్ కనెక్షన్ లేక ఇబ్బందులు
- కనెక్షన్‌ల కోసం రైతుల ఎదురుచూపులు


ప్రభుత్వం ఉచితంగా వేసిన బోరు బావి వద్ద రైతు పొర్తెటి హన్మంతు

పెంచికల్‌పేట్: గిరిజన రైతుల బీడు భూములను సాగు భూములుగా మార్చడానికి ప్రభుత్వం గిరివికాసం పథకాన్ని ప్రారంభించింది. గిరిజన రైతుల భూముల్లో బోరుబావులను తవ్వించి విద్యుత్ మోటార్లను, పైపులను సరఫరా చేసి వారిని ఆర్థికంగా బలోపేతం చేయడం పథకం ఉద్దేశం. గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గ్రామాల్లో గ్రామసభలను నిర్వహించి అర్హులైన గిరిజనులను గిరివికాసం పథకానికి ఎంపిక చేసింది. పెంచికల్‌పేట్ మండలంలోని కమ్మర్‌గాం గ్రామంలో మూడేళ్ల క్రితం లబ్ధిదారులను గుర్తించి పంట పొలాల్లో బోర్లను వేశారు. ఉచితంగా వేసిన బోర్లకు త్రీఫేజ్ విద్యుత్ కనెక్షన్‌లను ఇవ్వాల్సి ఉంది. మూడేళ్లుగా విద్యుత్ కనెక్షన్‌ల కోసం రైతులకు ఎదురుచూపులు తప్పడం లేదు.

ఎండిపోతున్న ఆయిల్‌పాం..

గిరిజనులకు భరోసా కల్పిస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో గ్రామానికి చెందిన పలువురు రైతులు పథకానికి దరఖాస్తులు చేసుకున్నారు. అర్హులను ఎంపిక చేయడంతో ఉద్యానవన అధికారుల ప్రోత్సాహంతో ముగ్గురు రైతులు ఆయిల్‌పాం సాగు చేశారు. బోర్లను వేసిన అధికారులు విద్యుత్ కనెక్షన్‌లు ఇవ్వడంలో కాలయాపన చేస్తుండటంతో వేసిన పంట ఎండిపోతుందని వాపోతున్నారు. వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి సాగు చేసిన పంటలు నీటి సరఫరా లేక నష్టపోతున్నామని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి విద్యుత్ సరఫరా చేయాలని వేడుకుంటున్నారు.

అటవీశాఖ అనుమతులు లేవు

గిరి వికాసం బోర్లకు త్రీఫేజ్ విద్యుత్ సౌకర్యం కల్పించడానికి గతంలోనే పనులు ప్రారంభించాం. పనులు సాగుతున్న సమయంలో అటవీశాఖ అధికారులు అటవీ భూముల్లో పనులు చేయొద్దని అడ్డుకున్నారు. దీంతో పనులు నిలిపివేశాం. పలుమార్లు అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చినా అనుమతులు ఇవ్వలేదు. అనుమతులు వస్తే వెంటనే త్రీఫేజ్ విద్యుత్ లైన్ పనులు ప్రారంభించి రైతులకు విద్యుత్ సరఫరా ప్రారంభిస్తాం.

– అంజల్‌కుమార్, విద్యుత్‌శాఖ ఏఈ, పెంచికల్‌పేట్

ఎండుతున్న పంటలు

- ఆయకట్టుకు అందని సాగునీరు
- మరమ్మతుకు నోచుకోని మాన్కాపూర్ చెరువు కాలువ


నీరు లేక ఎండిన మాన్కాపూర్ కాలువ

నార్నూర్: ఆరుగాలం కష్టపడి పంట సాగు చేస్తున్న రైతన్నకు కష్టాలు తప్పడం లేదు. ఏజెన్సీలో రైతులు ప్రత్యామ్నాయ పంట సాగుపై దృష్టి సారిస్తున్నారు. వానాకాలం సాగుతో పాటు రబీ సాగుపై రైతులు ప్రత్యేక దృష్టి సారించి లక్షల రూపాయలు ఖర్చు పెడుతున్నారు.

నార్నూర్ మండలంలో..

నార్నూర్ మండలంలోని మాన్కాపూర్ చెరువు ఆయకట్టు ద్వారా దాదాపు 1500 ఎకరాలు రబీ పంటలు సాగు చేస్తున్నారు. 50 శాతం రైతులు జొన్న, గోధుమ కోతకు వచ్చింది. మరో 50 శాతం రైతులకు సంబంధించిన జొన్న పంట సాగులో చివరి దశలో ఉంది. మాన్కాపూర్ చెరువు కెనాల్‌లో పూడిక పేరుకుపోవడంతో చెరువు నుంచి నీరు సరఫరా కావడం లేదు. దీంతో పంట సాగుపై రైతులు దిగులు చెందుతున్నారు. చేతికి వచ్చిన పంట ఎండిపోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

మరమ్మతుకు నోచుకోని కాలువ..

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అప్పటి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఏజెన్సీ సాగు, తాగు నీరు అందించాలనే ఉద్దేశంతో మాన్కాపూర్ గ్రామ సమీపంలో దాదాపు 3 కోట్ల రూపాయాలతో చెరువు నిర్మించారు. చెరువు ఆయకట్టు కెనాల్ నిర్మాణానికి రైతులు వ్యవసాయ భూములను సైతం ఇచ్చి సహకరించారు. కాలువ నిర్మాణం చెపట్టి దాదాపు 20 ఏళ్లకుపై అవుతున్నా.. మరమ్మతులు చేపట్టలేదు. కాలువ నుంచి నీరు బయటికి వృథాగా పోవడంతో రైతుల పంటలకు సాగునీరు సరిపోవడం లేదని వాపోతున్నారు. ఆయకట్టు ద్వారా మాన్కాపూర్, నార్నూర్, బలాన్‌పూర్, తాడిహత్నూర్, గంగాపూర్, నాగల్‌కొండ, ముక్తాపూర్ రైతులు ఆధారపడి వ్యవసాయం చేస్తున్నారు. అధికారులు స్పందించి కెనాల్ మరమ్మతులు చేయాలని రైతులు కోరుతున్నారు.

మరమ్మతు చేస్తాం

మాన్కాపూర్ చెరువు ఆయకట్టు ద్వారా మొత్తం 1500 ఎకరాల వరకు రైతులు పంటలు సాగు చేస్తున్నారు. చెరవులో పూడికతీత పనులు చేటపట్టడంతో పాటు కాలువ మరమ్మతుకు చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తాం.

– వినోద్ రాథోడ్, డీఈఈ, మైనర్ ఇరిగేషన్, ఉట్నూర్

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు సాధించాలి


ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థిని సన్మానిస్తున్న సీఐ సత్యనారాయణ

కెరమెరి: విద్యార్థులు చదువుల్లో రాణించి ఉన్నత లక్ష్యాలను సాధించుకోవాలని సీఐ సత్యనారాయణ, ఎస్సై మధుకర్ అన్నారు. ఆదివారం మండలంలోని ఆదివాసీ భవన్‌లో ఆదివాసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో పదో తరగతిలో ఉత్తీర్ణులైన ఆదివాసీ విద్యార్థులకు ఏర్పాటు చేసిన సన్మాన సభలో పాల్గొని మాట్లాడారు. చక్కటి ఉద్యోగాలు సాధించాలంటే ఫస్ట్ క్లాస్ మార్కులతో పాటు స్కిల్స్ డెవలప్ చేసుకోవాలన్నారు. ఈసందర్భంగా ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పెందోర్ మోతిరాం, విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు మడావి భరత్, మండలాధ్యక్షుడు సెడ్మకి తుకారాం, నాయకులు పెందోర్ శ్రీనివాస్, ఆడ ఆనంద్ రావు, సిడాం భీంరావు, దేవ్‌రావు, సంజీవ్, చిన్ను తదితరులు ఉన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపన

ఆదిలాబాద్‌టౌన్ (జైనథ్): భోరజ్ మండలంలోని సిర్సన్న గ్రామంలో నూతనంగా నిర్మించిన రేణుక మాతా ఆలయంలో భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ఠాపన చేశారు. ఆదివారం యాగశాలలో యజ్ఞంతో పాటు వివిధ కార్యక్రమాలు చేపట్టారు.